క్లుప్తంగా

రాజీ మార్గంలో కేసుల పరిష్కారం


కేసులను పరిష్కరిస్తున్న జడ్జిలు పి.దివాకర్, వి.దివ్య

నందికొట్కూరు: రాజీ మార్గంలో 266 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్, జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య తెలిపారు. శనివారం కోర్టు చాంబర్‌లో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించి కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు చట్టాలపై అవగాన కల్పించే బాధ్యత అందరిపై ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


గాయపడిన చంద్రశేఖర్

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. కాకనూరు గ్రామం నుంచి నంద్యాలకు వెళ్తున్న చంద్రశేఖర్, ఏ.కోడూరు గ్రామ సమీపంలోకి రాగానే, అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు బైకులు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరూ గాయపడటంతో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడుపరాదు


బస్టాండ్ సెంటర్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ సురేష్‌బాబు

పాములపాడు: మద్యం తాగి వాహనాలు నడపరాదని ఎస్‌ఐ సురేష్‌బాబు సూచించారు. శనివారం రాత్రి స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి కుటుంబం ఉందన్న విషయాని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే పరిస్థితులు ఎలా ఉంటాయో ఆలోచించుకోవాలన్నారు. పిల్లలకు బైక్‌లు ఇవ్వొద్దని, సెల్ ఫోన్ వాడుతుంటే వారిని గమనిస్తూ ఉండాలని సూచించారు. సెల్ ఫోన్లలో వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ బాలాజీనాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5 వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈనెల 25లోపు http:llapmr.apcfrr.knl ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలన్నారు.

పది పరీక్షలకు 460 మంది విద్యార్థులు సన్నద్ధం

పగిడ్యాల: ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మండల వ్యాప్తంగా 460 మంది విద్యార్థులు సన్నద్ధం అవుతున్నారని ఎంఈఓ సుభాన్ తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఇప్పటికే పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం స్టడీ అవర్లు నిర్వహిస్తున్నామన్నారు. పగిడ్యాల కేంద్రంలో 160 మంది, పాత ముచ్చుమర్రి కేంద్రంలో 120 మంది, లక్ష్మాపురం పరీక్షా కేంద్రంలో 180 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు.

మల్లన్నను దర్శించుకున్న మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. శనివారం రాత్రి మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన మంత్రి, ఎమ్మెల్యేకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

హుండీలు చోరీ

రుద్రవరం: స్థానిక భాస్కర నందీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మంగారి గుడి, పక్కనే ఉన్న సాయిబాబా కాశీరెడ్డి నాయన ఆశ్రమాల్లోని హుండీని గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు.. దినచర్యలో భాగంగా శుక్రవారం సాయంత్రం ఆలయాల్లో పూజా కార్యక్రమాలు పూర్తికాగానే తలుపులకు తాళాలు వేశారు. శనివారం ఉదయం పూజా కార్యక్రమాలు చేసేందుకు పూజారులు వెళ్లగా బ్రహ్మంగారి గుడిలోని హుండీని పగలగొట్టి సొమ్మును తీసుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న సాయికాశీరెడ్డినాయన హుండీని ఎత్తుకెళ్లారు. ఈవిషయంపై రుద్రవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయాల నిర్వాహకులు తెలిపారు.


ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి.


నందికొట్కూరులో మున్సిపల్ కమిషనర్ బేబిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


మిడుతూరులో మహిళా సర్పంచులను సత్కరిస్తున్న దృశ్యం

మహిళలు శక్తి స్వరూపిణులు

మహిళలు శక్తి స్వరూపిణులని పలువురు వక్తలు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. ఎలాంటి ఆటుపోట్లు ఎదురైనా తట్టుకోగలిగే శక్తిసామర్థాలు వారి సొంతమన్నారు. పలు చోట్ల మహిళా ఉద్యోగులను శాలువాలు, పూల మాలలు, బొకేలతో సన్మానించి వారి సేవలను కొనియాడారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించి వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని పలవురు గుర్తు చేశారు. ప్రస్తుత తల్లి దండ్రులు కూడా ఆడ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్



ఆత్మకూరులో మహిళా కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మకూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, ఎంపీపీ తిరుపాలమ్మ, తహసీల్దార్ రత్నరాధికతో పాటు ఐసీడీఎస్, అంగన్‌వాడీ టీచర్లను, పొదుపు మహిళా సంఘాల సభ్యులను, పట్టణ మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగభూషణంశెట్టి, కమిషనర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

- ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవంలో మేనేజర్ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా కండక్టర్లను సన్మానించారు. డిపో సీఐ నాయక్ పాల్గొన్నారు.
- ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ రాము ఆధ్వర్యంలో మహిళా కానిస్టేబుళ్లను, హోంగార్డును సత్కరించారు. ఎస్‌ఐ నారాయణ రెడ్డి పాల్గొన్నారు.
- నందికొట్కూరులో జరిగిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొని మున్సిపల్ కమిషనర్ బేబి, పొదుపు మహిళా సంఘాల నాయకురాళ్లను సన్మానించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ ఏసీడీపీఓ మంగవలి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.
- మిడుతూరులో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మిడుతూరు, సుంకేసుల, చెరుకుచెర్ల మహిళా సర్పంచులను సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్బయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.
- పగిడ్యాల వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య ఉపాధ్యక్ష, కార్యదర్శులు నరసమ్మ, నిర్మల అధ్యక్షతన మహిళా దినోత్సవం నిర్వహించారు. ఏపీఎం చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.


పగిడ్యాలలో...

పరీక్షా కేంద్రం తనిఖీ

మిడుతూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ (ప్రథమ సంవత్సరం) పరీక్షా కేంద్రాన్ని శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. 142 విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారి ఎల్లన్న తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం

ఆత్మకూరు: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఇంటి స్థలాలు, పక్కా గృహాలు, పొలాలు ఆన్‌లైన్, రహదారుల ఏర్పాటు తదితర సమస్యలపై 150 మంది వినతులు అందజేశారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీఓ నాగభూషణం శెట్టి, కమిషనర్ రమేష్‌బాబు, ఆత్మకూరు సీఐలు రాము, సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు

జూపాడుబంగ్లా: ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్ టికెట్ చూపి ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణించవచ్చని ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండ్లెం, పారుమంచాల, తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులతో పాటు జూపాడుబంగ్లాలోని మోడల్, కస్తూర్బా, గురుకుల, ఉన్నత పాఠశాలలకు చెందిన 450 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇతర గ్రామాల నుంచి పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఆర్టీసీ బస్సుల్లో కండెక్టర్లకు హాల్‌టికెట్ చూపించి ఉచితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవచ్చన్నారు.

లోక్ అదాలత్‌లో 297 కేసులు పరిష్కారం


కేసులు పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

ఆత్మకూరురూరల్: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 297 కేసులు పరిష్కారమయ్యాయి. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో వివిధ కేటగిరీలలో రాజీ పడదగ్గ కేసుల్లో పలువురు కక్షిదారులు రాజీ మార్గంలో తమ కేసుల నుంచి విముక్తులయ్యారు. సివిల్ కేసులు 4, క్రిమినల్ కేసులు 20, ఎక్సైజ్ కేసులు 13, మోటార్ వెహికల్ యాక్ట్ కింద నమోదైన కేసులు 8, పెట్టీ కేసులు 252, బ్యాంకు బకాయిల కేసులు 22 .. మొత్తం కలిపి 297 కేసులు మెగా లోక్ అదాలత్‌లో పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాణిక్యరావు, వెంకటేశ్వర్లు, గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల కక్కుర్తి!

- సబ్సిడీ రుణాల్లో వాటా ఇవ్వాలంటూ డిమాండ్

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల (బీసీ)తో పాటు ఓసీ కులాలకు సబ్సిడీ రుణాల మంజూరుకు నోటిఫికేషన్ జారీ చేసింది. బీసీ–ఎకు 23, బీసీ–బి 14, బీసీ–డి 7, బీసీ –ఇ 11, ఈబీసీలకు 2, ఓసీ రెడ్డి 1, వైశ్యులకు 1, కాపులకు 6 చొప్పున మొత్తం 65 మందికి రుణాలు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. అన్ని వర్గాల నుంచి 155 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే కూటమి నేతలు కొందరు రుణాలను మంజూరు చేయిస్తామంటూ దరఖాస్తుదారులకు గాలమేస్తున్నారు. సబ్సిడీలో 50 శాతం ఇవ్వాలని షరతు విధిస్తున్నారు. యూనిట్లు పెట్టుకోక పోయినా ఫర్వాలేదని, అంతా తామే చూసుకుంటామని, సబ్సిడీ మాత్రం చెరి సగం పంచుకుందామని, దీనికి సమ్మతి తెలిపితేనే రుణం మంజూరు అవుతుందని భయపెడుతున్నారు.

చేతి పంపులకు మరమ్మతులు


తాటిపాడులో చేతిపంపుకు మరమ్మతులు చేస్తున్న మెకానిక్


ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు వద్ద పైపులకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచు వరప్రసాద్

జూపాడుబంగ్లా: మండలంలోని చేతిపంపులకు మరమ్మతులు చేయిస్తున్నట్లు తాగునీటి శాఖ ఏఈ నాగేంద్ర తెలిపారు. శనివారం మండలంలోని తాటిపాడు గ్రామంలో సర్పంచ్ వంగల లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో చేతిపంపులకు మరమ్మతులు చేయించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ వేసవిలో నీటి సమస్య నివారణకు గాను రూ.5 లక్షల మండల పరిషత్ నిధులు వెచ్చించి చేతిపంపుల పరికరాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా చేతిపంపులు పనిచేయకపోతే సర్పంచులు తమ దృష్టికి తెస్తే బాగు చేయిస్తామన్నారు.

ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు పైపులైన్‌కు..

పాములపాడు: మండలంలోని క్రిష్టారావుపేట గ్రామంలో సర్పంచు వరప్రసాద్ ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు వద్ద శనివారం పైపులైన్ మరమ్మతులు చేయించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు కావడంతో జీఐ పైపులు శిథిలావస్థకు చేసి నీరు లీకై వృథా అవుతుంది. వేసవిని దృష్టిలో ఉంచుకొని నీటి వృథాను అరికట్టేందుకే పైపులైన్ మరమ్మతులు చేయిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపి చెక్ పోస్ట్ సమీపంలో భిక్షాటన చేస్తున్న ఓ వృద్ధుడు తలముడిపి నుంచి మంచాలకట్ట వెళ్లే దారిలో రోడ్డు పక్కన మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్‌ఐ ఓబులేసు వీఆర్వో ఖాదర్‌బాషాతో కలిసి శనివారం ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

బండిఆత్మకూరు: మండల పరిధిలోని సింగవరం గ్రామానికి చెందిన రమేష్ శనివారం ఆత్మహత్యకు యత్నించాడు. ఎస్‌ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాలు.. రమేష్ కొంత కాలంగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. వైద్యులకు చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సాయంత్రం ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పటించుకుని ఆత్మహత్యకు యతించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం రమేష్ ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు.

నల్లమలలో డ్రోన్ కెమెరాల నిఘా

మహానంది: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిని, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఐ రామమోహన్ రెడ్డి తెలిపారు. ఎంసీ ఫారం, బుక్కాపురం, అల్లినగరం, శ్రీనగరం గ్రామాల పరిధిలో శనివారం డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

బంగారం ఆభరణాలు చోరీ

నందికొట్కూరు: పట్టణంలోని కుర్వపేటకు చెందిన సాయికొండ శ్రీనివాసులు ఇంట్లోని బంగారం ఆభరణాలు చోరీకి గురయ్యాయి. టౌన్ ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాలు.. శనివారం మధ్యాహ్నం శ్రీనివాసులు ఇంటికి తాళం వేసి గొర్రెల మందకు నీళ్లు తాగించేందుకు వెళ్లాడు. తిరిగి వచ్చేలోపు తలుపు తెలిచి ఉండటంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బీరువాలోని 5 తులాల బంగారం ఆభరణాలు చోరీ అయినట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పార్లమెంట్ ఆమోదం లేకుండా ఎస్సీ వర్గీకరణ ఎలా చేస్తారు


సమావేశమైన మాలమహానాడు నాయకులు

నందికొట్కూరు: పార్లమెంట్ ఆమోదం లేకుండా ఎస్సీ వర్గీకరణ ఎలా చేస్తారని మాలమహానాడు జేఏసీ నాయకులు అశోక్‌రత్నం, నగేష్, శివప్రసాద్ ప్రశ్నించారు. శనివారం పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కులగణన చేయకుండా, జనాభా లెక్కలు తేల్చకుండా ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. పార్లమెంట్ ఆమోదం లేకుండా, కులగణన చేయకుండా ఉషా మెహ్రా రామచంద్ర రావు కమిషన్ వర్గీకరణ ఎలా చేస్తుందన్నారు. దళితులను విభజించి రాజ్యాధికారానికి దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగదన్నారు. దళితుల హక్కులకు భంగం కలించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మేలో వేలాది మాలలతో నందికొట్కూరు పట్టణంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా భారీ బహిరంగ సభ నిర్వహించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు డాక్టర్ రాజు, అచ్చెన్న, యాట ఓబులేసు, డాక్టర్ వెంకటేశ్వర్లు, తమ్మడపల్లె ఏసేపు, నాగరాజు, అయ్యన్న, చరణ్, లాలు, శ్రీను పాల్గొన్నారు.


కేసీ కాలువలో దూకుతున్న పిల్లలు

ఈత సరదా!



సెకండ్ సాటర్ డే సెలవు దినం కావడం.. కాస్త ఎండలు ఉండటంతో వేడి తాపం నుంచి విముక్తి కోసం పలువురు చిన్నారులు కేసీ నీటిలో సరదాగా ఈత కొడుతూ కనిపించారు. మిట్టకందాల గ్రామ సమీపంలోని తూడిచెర్ల వద్ద ఉన్న కేసీ కాలువలో శనివారం చిన్నారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఈత శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుంది.

– పాములపాడు

పరిశుభ్రతకు నోచుకోని తాగు నీటి ట్యాంకులు



ట్యాంకు శుభ్రం చేసి క్లోరినేషన్ చేసినట్లుగా నమోదు చేయని తేదీ


పరిశుభ్రతకు నోచుకోని తాగునీటి ట్యాంకు

జూపాడుబంగ్లా: అధికారుల పర్యవేక్షణ లేకపోవడం .. సిబ్బంది నిర్లక్ష ఫలితం వెరసి తాగునీటి ట్యాంకులు పరిశుభ్రతకు నోచుకోవడం లేదు. మండలం వ్యాప్తంగా 27 ఓవర్‌హెడ్‌ట్యాంకులు, 15జీఎల్‌ఆర్ ట్యాంకులున్నాయి. వాటిని 15 రోజులకోపర్యాయం శుభ్రంచేసి క్లోరినేషన్‌చేసిన నీటిని ప్రజలకు సరఫరా చేయాల్సి ఉంది. క్లోరినేషన్ చేసినట్లుగా తాగునీటి ట్యాంకులపై ఎప్పటికప్పుడు తేదీని నమోదు చేయాల్సి ఉంది. ఇప్పటిదాకా ఎక్కడా సక్రమంగా తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసిన దాఖలాల్లేవు. తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత, క్లోరినేషన్ నిమిత్తం ఆర్థిక సంఘం నిధులతో పాటు శానిటేషన్ నిధులు, గ్రామపంచాయతీ జనరల్ ఫండ్స్ వినియోగించుకోవచ్చు. అయితే గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ట్యాంకులను పక్షం రోజులకోసారి శుభ్రంచేసి, నీటిని క్లోరినేషన్ చేసిన దాఖలాల్లేవు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాల్సి ఉండగా దాన్ని అస్సలు అమలుచేయటం లేదనే విమర్శలున్నాయి. ప్రతి రోజు గ్రామాల్లోని సర్పంచులు, ఆరోగ్యకార్యకర్తలు తాగునీటి ట్యాంకుల వద్ద నీటి శాంపిల్స్ సేకరించి నీటిని పరీక్షించి రికార్డుల్లో నమోదు చేయాల్సి ఉంది. తాగునీటిలో లవణాల శాతం, ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉన్నట్లు నీటి పరీక్షల్లో తేలితే ఆ నీటిని తాగవద్దని ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత అధికారులు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలపై ఉంది. నీటి పరీక్షలు నిర్వహించేందుకు గతంలో నీటి పరీక్షా పరికరాలను ప్రతి సచివాలయానికి రెండు కిట్ల చొప్పున మంజూరు చేశారు. నీటి పరీక్ష కిట్లను వినియోగించి ఇప్పటిదాకా నీటిపరీక్షలు నిర్వహించిన దాఖలాల్లేవు. దీంతో ఫ్లోరైడ్, కలుషిత నీటిని తాగి ప్రజలు మోకాళ్లనొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. జిల్లా అధికారులు చర్యలు తీసుకొని తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించటంతో పాటు స్వచ్ఛమైన నీటిని అందజేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉగాది ఉత్సవాల్లో స్పర్శ దర్శనం ఉండదు


కర్ణాటక రాష్ట్రంలో ధర్మప్రచార రథంలో ఆశీనులైన స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి, అర్చకులు,


విజయపురలో ధర్మప్రచార రథంలో కళాశాలతో మహిళల శోభయాత్ర

- శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి
- కర్ణాటక రాష్ట్రం విజయపురలో అక్కడి భక్త బృందాలతో సమన్వయ సమావేశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈనెల 27 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని స్వామివారి స్పర్శ దర్శనం నిలిపివేసినట్లు శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి తెలిపారు. ఉత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు రానుండటంతో శనివారం ఆ రాష్ట్ర భక్త బృందాల సమన్వయ సమావేశం విజయపుర నగరంలోని సిద్దేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వహించారు. శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోందన్నారు. కాగా ఉగాది ఉత్సవాల్లో ప్రతిరోజు వేలాది మంది భక్తులు ఆలయానికి రానుండటంతో స్వామివారి స్పర్శ దర్శనానికి అవకాశం ఉండదన్నారు. ఉత్సవాలకు ముందే ఈ నెల 17 నుంచి 26 వ తేదీ వరకు 10 రోజుల పాటు రోజుకు నాలుగు విడతల్లో మల్లన్న స్పర్శ దర్శనం ఉంటుందన్నారు. అనంతరం దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు పంపిన సందేశాన్ని శ్రీశైలప్రభ సహాయ సంపాదకులు కె.సత్యబ్రహ్మచార్య కన్నడలో అనువదించి చెప్పారు. ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పాదయాత్ర భక్తుల కోసం నల్లమల అడవిలో కూడా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో స్వామివార్ల ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, ఏఈఓ జి.స్వాములు, పర్యవేక్షకులు ఆర్.మల్లికార్జున పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో స్వామి వారి శోభాయాత్ర

భక్త బృందాల సమన్వయ సమావేశాన్ని పురస్కరించుకుని విజయపుర నగరంలో దేవస్థానం ధర్మప్రచార రథంతో శోభయాత్ర నిర్వహించారు. సాయంత్రం స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభయాత్రను ప్రారంభించారు. వంద మంది మహిళలు కలశాలను చేతబట్టి శోభయాత్రలో పాల్గొన్నారు. విజయపుర నగరంలోని సిద్దేశ్వరస్వామి, దానమ్మదేవి, శంకరలింగ, కాళమ్మ ఆలయాల నుంచి గాంధీ సర్కిల్ మార్కెట్ మీదుగా శోభయాత్ర సాగింది.